# నిశ్శబ్ద గాంధర్వం

ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్. ఎం.ఎ. పి.హెచ్‌డి., Hyderabad, AP

'సార్ కారు చెడిపోయింది'

నా గుండె గుభేలుమంది. మా డ్రైవరు నైపుణ్యం నాకు బాగా తెలుసు. సుబ్రహ్మణ్యం రిపేరు మొదలెట్టాడంటే క్యాలండరు తేదీలు ఖాయంగా మారుతాయి. కాని, ఇప్పుడు గత్యంతరమేమిటి? ముందు నుయ్యి, వెనుక గొయ్యి తయారయింది పరిస్థితి. వృత్తిరీత్యా నా శత్రువుగా వున్నవానిపై కన్నా ఎక్కువ కోపం వచ్చింది సుబ్రహ్మణ్యం మీద – నిజాని కతని తప్పు లేకపోయినా.

'ఫరవాలేదు సార్. మైనర్ రిపేరే. మీరు కాసేపు చల్లగాలి పీల్చే లోపలే బాగవుతుంది బండి.' మైనరు అంటే సుబ్రహ్మణ్యం పరిభాషలో కనీసం మూడుగంటలన్నా పడుతుందని అర్థం. చుట్టూ చూశాను. ఎదురుగా పొడవైన బ్రిడ్జి. గడియారం ఎనిమిది గంటలు చూపుతున్నది.

'బీచుపల్లి దాకా వచ్చాము సార్. బ్రిడ్జి దాటితే రంగాపురం. దానిపైనే పెబ్బేరు' కారు ఆగకపోయునట్లయితే ఈపాటికి రంగాపురం దాటేవాళ్ళమన్నట్లు చూస్తున్నాడు విసుగ్గా సుబ్రహ్మణ్యం. డిక్కీ తీసి రిపేరు సరంజామా బయటకు లాగుతున్నాడు. నేనొక్కసారి ఒళ్ళు విరుచుకుని చుట్టూ చూశాను. అంతా ఒకటే నిశ్శబ్దం.

ఎక్కడా జన సంచారం లేదు. కొన్ని గజాల దూరంలో కృష్ణవేణమ్మ చాలా నిదానంగా అస్తి- నాస్తి విచికిత్సకు లోనై ప్రవహిస్తూ ఏదో గాంధర్వాన్ని ప్రసరిస్తున్నది. చిరు చలి నన్ను చక్కలిగింతలు పెడుతున్నది. గాలి అలలు, నీటి రొదలు నా గుండెలో ఏదో గలగలమని నినదించి తెలియని మత్తునొకదాన్ని కలిగించాయి. అలా అటు ఇటు పాదచ్ఛాయలు వేస్తూ రోడ్డు మీదనించి కొన్ని గజాల దూరంగా వెళ్ళాను. ఆ వెన్నెల్లో ఏదో ప్రాచీన దేవాలయం ఒకటి అక్కడ వున్నట్లు పోల్చుకున్నాను. కుతూహలంతో మరికొంచెం ముందుకి సాగాను. వేపచెట్టు మీదినుంచి సన్నటి ఈదురుగాలి, సుదూరంగా మినుకు మినుకుమంటూ ఎక్కడో దీపాలు. గుడి గుమ్మం దగ్గర నిలబడి చూశాను. లోపల ఓ ఆముద ప్రదిమ వెలుగుతున్నది. సుబ్రహ్మణ్యం పూర్తిగా తన పనిలో నిమగ్నమై పోయి తక్కిన ప్రపంచాన్ని మరచేపోయాడు. నేనొకసారి గుడిని, చుట్టూ ఉన్న ప్రకృతిని పరిశీలించాను. ఆ దేవాలయం చాలా పాతదిలా కనబడింది. వెలుగు స్పష్టంగా లేకపోవడంతో అక్కడి శిల్పాలు పోల్చుకోలేక పోయాను. పక్కనే కృష్ణా నది. ఏం దేవాలయమో ఇది? ధూప దీప నైవేదాయలు ఉన్నాయా? లేక శిథిలమా? శిథిలమనే మాట గుర్తుకు రాగానే కొంచెం భయమేసింది. లోనికి తొంగి చూచాను.

'ఎవరు అక్కడ?' లోనుండి నన్ను చూచి ఎవరో వేసిన ప్రశ్న.

నేనొక్కసారి ఉలిక్కిపడ్డాను.

'ఎవరా గుమ్మం దగ్గర?' మళ్ళీ ప్రశ్న. ఈసారి తమాయించుకొని 'నేనే' నన్నాను అవ్యక్తంగా.

'అంటే...' లోపలినుండి మళ్ళీ ప్రశ్న.

ఓ రెండడుగులు ముందుకు వేసి అన్నాను. 'బాటసారి...హైదరాబాదు పోతూ...'

ఆలయ ప్రాంగణంలో ఓ మానవాకారం కదిలినట్లనిపించింది. అతడు తలెత్తి చూచినట్లున్నాడు. ఓసారి పొడి దగ్గు దగ్గి, 'ఆ దూరాన కారు మీదేనా బాబూ' అన్నాడు. ఈ మాటలో ఇందాకటి ప్రశ్నార్థకాల్లో ఉన్న వాడి, వేడి లేదు. చాలా సౌమ్యంగా ఉంది.

'ఆ ఆ మాదే కారు. కర్నూలునుండి బయలుదేరి వస్తున్నాము.' అన్నాను కొంచెం ధైర్యంతో రెండడుగులు వేసి. ఇతడెవరో బిచ్చగాడో, గంజాయిగాడో అయివుంటాడు. లేకుంటే ఈ పాతబడ్డ గుళ్ళో ఈ వేళ ఎవరు కూర్చుని వుంటాడు?

అంతేనా? లేక ఒకవేళ ఏ దొంగవాడేనా? ఈ భావం మనస్సులోకి వచ్చేసరికి ఒళ్ళొకసారి ఝల్లుమన్నది. వేప చెట్టు గలగలమని శబ్దం చేస్తూ ఊగింది. అయినా, నాకేమి భయం? దూరంగా బలవంతుడైన సుబ్రహ్మణ్యం ఉన్నాడు కదా అని నాకు నేనే సమాధానం చెప్పుకున్నాను.

'కూర్చోండి బాబూ. బండి రిపేరు ఆలస్యమవుతుందేమో.' ఆ మాటల్లో అఘాయిత్యం లేదు. ఆత్మీయతా, ఆప్యాయతలు ఉన్నాయి. కేవలం ఆదరణే కాదు స్వచ్ఛత కూడా వుంది. సంస్కారం కూడా వుట్టి పడుతున్నది.

'ఇదేం గుడి?' నిలబడే ప్రశ్నించాను.

'హనుమాన్ల మందిరం బాబూ, చాలా సుప్రసిద్ధమైన గుడి. మహత్యం గల దేవుడు.'

హనుమంతుడి పేరు వినేసరికి నాకు కొండంత ధైర్యం వచ్చింది. ఆంజనేయుడి చుట్టు పక్కల కొన్ని మైళ్ళ దూరంలో దయ్యాలూ, భూతాలూ ఉండటానికి వీలు లేదు. దొంగలూ, తాగుబోతులూ చరించే అవకాశం లేదు.

'దాహమైతే ఆ నీళ్ళు పుచ్చుకోండి బాబూ, చాలా బాగుంటాయి' చూచాను. బావి, చేదా వున్నాయి. జోళ్ళని విప్పి, ఓ చేద నీళ్ళు తోడుకొని కాళ్ళూ చేతులూ కడుక్కొని, కాసిని తాగాను. నిజంగానే నీళ్ళు చాలా రుచిగా వున్నాయి. ఎంత బాగున్నాయంటే గండిపేట నీళ్ళు కూడా దానిముందు ఆగలేవు. చేతి గుడ్డతో అరచేతులు అద్దుకుంటూ అక్కడొక అరుగుంటే దానిపై కూర్చున్నాను. నాకు కొన్ని గజాల దూరంలో బిచ్చగాడు క్రింద కూర్చున్నాడు. నిశ్శబ్దమైన ప్రకృతి. 'మీ పేరేం బాబూ?' బిచ్చగాని ప్రశ్న.

ఓనవ్వు నవ్వాను. ఆ నవ్వులో ఆత్మవిశ్వాసమూ, గర్వమూ రెండూ కలిసి ఉన్నాయి. పేరు చెప్పడానికి సూచిస్తున్న అయిష్టతా ఉన్నాయి. నిజమే. నా పేరు ఇందుశేఖర్ అని చెపితే ఇంకేమైనా ఉందా? ఈ బిచ్చగాడు పరుగెత్తుకుంటూ బీచుపల్లి గ్రామంలోకి పోయి ఇందుశేఖర్ వచ్చాడని కేక వేస్తే చాలదా? జనం ఈగల్లా మూగుతారు. ఇక ఈ రాత్రికి ప్రయాణం ఉండదు. అందుకనే ముక్తసరిగా అన్నాను, మల్లయ్య అని. అయితే నేను అబద్ధం మాత్రం ఆడలేదు; దేవున సన్నిధిలో. నా చిన్నప్పుడు నన్ను మల్లయ్య అంటూ ఉండేవారు. నాకు అంతర్జాతీయ గాయకునిగా పేరు ప్రఖ్యాతలు రాబోయే తరుణంలో నేనే ఇందుశేఖర్ అని పేరు మార్చుకున్నాను. ఆ తరవాతనే ప్రపంచ పర్యటనలూ, లక్షలకు లక్షల నిధులూ, సన్మానాలూ, బిరుదు ప్రధానాలూ జరిగాయి.

'ఎందాకా పోతున్నారు మల్లయ్యగారూ?'

'హైదరాబాదుకు' నిజమే చెప్పాను.

'ఏం చేస్తుంటారూ బాబూ అక్కడ?'

'ఏదో చిన్న వ్యాపారం' సగం నిజమూ, సగం అబద్ధమూ. సంగీతం వ్యాపారమవుతుందా? ఏమో మరి. డబ్బూ సంపాదిస్తున్నా కాబట్టి వ్యాపారమే. అయితే, చిన్న వ్యాపారమేమిటి లక్షల మీద టర్నోవర్ సాగుతుంటే...అయినా, నా దృష్టిలో అది చిన్నదే. ఎంతచేస్తే అది పెద్దదవుతుంది? కోట్లా డాలర్లా?

'నీ పేరు?' ఎదురు ప్రశ్న వేశాను.

'నారదుడు బాబూ.'

నవ్వొచ్చింది. వీడి సన్నాసి వేషానికి తగ్గట్టే ఉంది పేరుకూడా. చిన్నప్పుడు ఏ భైరవుడో అయి వుంటుంది. బిచ్చగాడైనాక నారదుడై వుంటాడు.

'ఏం చేస్తుంటావు తాతా?'

'ఏముంది బాబూ. ఈగుళ్ళో కూర్చుంటాను. ఇక్కడా రాత్రిళ్ళు పడుకుంటాను. పగలు ఎప్పుడైనా బీచుపల్లిలో ఓ ముద్ద పెడితే తింటాను.

లేకుంటే లేదు.' ఇలాంటి సోమరిపోతుల వల్లే దేశం దరిద్ర స్థితిలోకి వచ్చింది. జపాన్ ఇంత అగ్రమైందంటే ఎందువల్ల? సోమరితనమంటే వాళ్ళకసహ్యం. ఇదే మరి కొన్ని దేశాల్లో అయితే, బిచ్చగాళ్ళని కాల్చి పారేస్తారు. కానీ, ఇది ఇండియా, దటీజ్ భారత్ కదా...అడుగు కొక నారదుడు, అంగుళాని కొక తుంబురుడు. 'ఏదైనా పని చేసుకోరాదా తాతా.' కొంచెం కోపం మిళాయించి గాంభీర్యం మాత్రం కోల్పోకుండా అన్నాను.

'ఏం చేయను బాబూ పని. చేసినవన్నీ చేశాను. ఇంకేం చేయను? ఈ పాపిష్టి పొట్టకు ఏవో గుప్పెడు మెతుకులు రాక పోతాయా ఇక?' ముష్టి బతుకుకొక వేదాంతం కూడానూ.

'మల్లయ్యగారూ, మీరు నమ్ముతారో లేదో కానీ, నాకు ఢిల్లీలో సన్మానం జరిగినప్పుడు రామలీలా మైదానంలో బహిరంగ సభ జరిగింది. దానికి రెండు లక్షల జనం వచ్చారు. నాకే వచ్చారు. మళ్ళీ దేశపు ప్రధానికే వచ్చారు.' ఉలిక్కి పడ్డాను. ఇప్పటి వరకు యధాలాపంగా వింటున్న వాణ్ణి ఒక్కసారి ఆశ్చర్యంతో చెవులు నిక్కబొడుచుకుని, గుడ్లు మిటకరించుకొని చూస్తున్నాను. ఈ నారదుడు బిచ్చగాడేనా? లేక పిచ్చివాడు కూడానా?

'మద్రాసులో మెరీనా బీచ్‌లో సన్మానం, హాంగ్‌కాంగ్‌లో ఆ దేశ ప్రధానితో ఫొటో, అమెరికాలో రేడియోలో, టెలివిజన్‌లో ప్రదర్శనలు, మల్లయ్యగారూ, మీరు నమ్ముతారో లేదా కానీ, ఓహ్ ఆ జీవితంమేం జీవితం. రాజా జీవితం. నేను నడుస్తోంటే బంగారు తివాసీలు పరిచేవారు. గులాబీ దండలూ, గులాబీలవంటి పిల్లలూ నా ఒక్క చూపుకై తమ సర్వస్వం సమర్పించుకొనే వారు. ఆటోగ్రాఫు పుస్తకాలు పట్టుకుని నగరాలకు నగరాలన్నీ నా కారు చుట్టుముట్టేవి.' ఆశ్చర్యంతోనూ, భయంతోనూ స్తంభించి పోయాను. ఇతను చెప్పేది నిజమేనా? అయితే ఇతనెవరు? ఇతను చెప్పేది అబద్ధమా? అయితే, నేను పిచ్చివాడితో మాట్లాడుతున్నానా?

'బాబూ, మీకు విసుగు కలిగిస్తున్నాను.'

'లేదు తాతా. నీవు చెప్పేది వింతగా ఉంది, పూర్తిగా వినాలని కోరికగా ఉంది.'

'పోనిలెద్దు మల్లయ్య బాబూ. ఆపాపిష్టి కథంతా ఎందుకు...హాయిగా ప్రశాంతమైన పాలవెన్నెనలో స్వామివారి సాన్నిధ్యంలో కూర్చున్నాము. ఓ పది నిముషాలు నిశ్శబ్దాన్ని ఉపాశించడం నాదబ్రహ్మానికి చివరి దశ. ఆ తరవాత సంగీతమూ. సర్వేశ్వరుడూ సమైక్యమైన చరమావధి వస్తుంది.'

నాలో ఆతృత కట్టలు తెంచుకుని ప్రవహించింది. 'నారదుడుగారూ...మీ కభ్యంతరం లేకపోతే మీ గూర్చి వినాలని వుంది.'

నారదుడు నిండుగా నవ్వాడు. తెల్లగా నవ్వాడు. ఆ నవ్వు వెల్లువగా మారి పాల మీగడవంటి వెన్నెలలో కలిసి పోయింది.

'అయితే వినండి బాబూ. ఇది సంగీతానికి సంబంధచిన కథ. మీకు సంగీతమంటే ఇష్టమేనా?'

'ఆ – ఆ.'

'ఏ సంగీతం ఇష్టం? శాస్త్రీయమా? లేక మ్యూజికా?'

'రెండూనూ' అన్నాను నేనేమి బయట పడకుండా.

'అదృష్టవంతులు. ఈ రోజుల్లో శాస్త్రీయ సంగీతం చాలామంది వినలేక పోతున్నారు. అది వాళ్ళ తప్పు కాదులే. జాతిమొత్తము బలహీనమై నీరసించి పోయింది. పుష్టి లేని తిండి, పుష్టి లేని బతుకు. పుష్టి లేని సంగీతం.'

నేను స్థాణువునై కూరెచుని వింటున్నాను.

'మల్లయ్యబాబూ' నారదుడొక పొడి దగ్గు దగ్గి మళ్ళీ మొదలు పెట్టాడు. 'నేను చిన్నప్పుడు గురుముఖంగా కర్ణాటకం అభ్యసించాను. తరవాత హిందుస్థానీ కూడా నేర్చుకున్నాను. ' దరిశన లాలీ దౌరి దౌరి ఆయీ సబ్ గోకులకి నారి' అనే చరణాన్ని దాదాపు మూడు సంవత్సరాలు సాధన చేశానంటే మీరు నమ్ముతారో నమ్మరో, నేర్చుకోవడమంటే కేవలం వినోదంగా నేర్చుకోవడం కాదు. అదొక తపస్సు. అదొక సాధన. అదే యోగము, త్యాగమూ రెండూను. ఈ రకంగా సాగింది. నా చదువంతా ముగిశాక గురువుగారికి ఏదో దక్షిణలు అందరితో బాటు సమర్పించాను. అప్పుడాయన అన్నాడు. 'నారదుడూ, నేను నీ అల్పమైన కానుకలతో సంతృప్తి చెందను. నాకు నీవొక ప్రతిజ్ఞ చేయాలి.' 'చెప్పండి మహరాజ్' అన్నాను. ఆయన ఉత్తర ప్రదేశ్‌కు చెందిన యోగి. ఆయన్ని మేము మహరాజ్ అనే పిలిచేవాళ్ళం. ఆయన ఇట్లా అన్నాడు.

'ఈనాడు సమాజం వింటున్నది సంగీతం కాదు. కేవలం కొన్ని ధ్వనులూ, నాలుగు అరుపులూ, రెండు కరుపులూ కలిపి సంగీతం పేర చలామణీ చేస్తున్నారు. నిజమైన సంగీతం ఇది కాదని నీకు తెలుసు. కాబట్టి నారదుడూ, జనన పరమార్థమేమిటో మరచిపోకుండా నాదోపాసన ద్వారా ఈశ్వర సాక్షాత్కారానికై ప్రయత్నించు. సమాజాన్నే ఈశ్వరుని స్థానంలో ఉంచి ఆరాధించు. స్వార్థంతో, ధనాకాంక్షతో సంగీతాన్ని అమ్ముకోకు. భ్రష్టుడవౌతావు.' ఆఖరి రోజున గరువుగారి పాదాల దగ్గర ప్రణామం తీసుకుని సంగీతంతో ఈశ్వరోపాసన చేయాలని బయలుదేరాను.

ధనాన్ని వాంఛించకుండా కేవలం దేవాలయాల్లో భజన కార్యక్రమాలలో పాటలు పడుతూ ఆనందంతో పరవశిస్తూ కొన్నాళ్ళు గడిపాను. ఇలా వుండగా హైదరాబాదు మలక్‌పేట కాలనీలో ఒక గానసభ భవనం నిర్మిస్తుంటే దానికై విరాళాలకు గాను భక్త బృందం రవీంద్ర భారతిలో ఓ కార్యక్రమం ఏర్పాటు చేసింది. అందులో నన్నూ పాడవలసిందని నిర్బంధించారు. పాడనా వద్దా అని సంశయించాను. ఒక ఉదారమైన కార్యక్రమం కాబట్టి దానికై పాడటంలో స్వార్థం లేదులెమ్మని సమాధాన పరుచుకొని వెళ్ళి పాడాను. ఆ పాట స్థానికులను చాలా మందిని ఆకర్షించింది. ఒక నిర్మాత వెంటనే తన హిందీ చిత్రంలో నన్ను బుక్ చేసుకుని ఎడ్వాన్స్‌గా ఒక చెక్కు ఇచ్చాడు. అది ఎల్లా తీసుకున్నానో నాకే తెలియదు. ఓ గంపెడు పూలమాలలూ, ఓ చెక్కుతో ఇల్లుతే చేరాను కాని, ఆ రాత్రి పూజా మందిరంలో చేసే ఏకాంత సేవలో నిష్ఠ కుదరలేదు. నా గొంతు నాకే ఎదో కొత్తగా వినిపించింది. తపోభంగం జరిగిన ఏ గంధర్వుడో నేలపై నిలబడి అరుస్తున్నట్టు నాకే అనిపించింది. కాని విధి విచిత్రం. ధనానికున్న ఆకర్షణ అటువంటిది. నేను లౌకిక ప్రవాహంలో మునిగిపోయాను. కిరాయి గాయకుణ్ణిగా మారాను.

చూస్తుండగానే జీవితంలో అద్భుత పరిణామాలు కనిపించాయి. అంతకుముందు ఎంతో ఆశ్రయిస్తేనే తప్ప లభించని అవకాశాలు వాటంతట అవే కాళ్ళ దగ్గరకి వచ్చేవి. గంటలకు గంటలు రేడియో వాళ్ళు నేషనల్ ప్రోగ్రామ్స్‌తో సహా నాకిచ్చేవారు. నా పాట కచ్చేరి ఏ క్లబ్ సహాయార్థమైనా ఏర్పాటు చేసుకుంటే కనకవర్షం కురిసేది. ప్రేక్షకుల రుచులు బాగా గమనించాను. శ్రోతలెక్కువ మంది శాస్త్రీయ సంగీతం కోరరు. వాళ్ళకి జిలేబీ సంగీతం కావాలి. దానికి బరువు, లోతు వుండకోడదు. కేవలం కాసేపు గాలిలో అటు ఇటు ఊపించి వదిలే సరకు కావాలి. సమాజం డాల్డా టిఫిన్లకి అలవాటు పడింది. గట్టిగా ఓ రెండు కళ్ళు ఆవకాయ అన్నమో ఇన్ని చల్ది పెరుగు ముద్దలో తినమంటే తినలేదు. తిని జీర్ణించుకోనూ లేదు. అందుకనే నేనూ వాళ్ళ స్థాయికి దిగజారి పోయాను. 'నారదుడుగారూ – 'చెంగు చెంగున రౌడీ పిల్లా' అన్న పాట పాడండి.' అని ప్రేక్షకుల నుండి కేకలు వచ్చేవి. అది పాడితే వచ్చినవన్నీ వన్స్‌మోరులూ ఏ త్యాగరాజు పాటకూ నేను జీవితంలో పొందలేదు మల్లయ్యన్నా. 'పిల్లా ఓ పిల్లా ఓహోహోహో పిల్లా, పిల్లా ఓ పిల్లా ఓహోహోహో పిల్లా, ఓ నవ్వుల గలగల పిల్లా, ఓ ముద్దుల గిలగిల పిల్లా గలగల గలగల గిలగిల గిలగిల పిల్లా' అనే పాటను ఈ మొత్తం తెలుగు దేశంలో నేను పాడని సెంటరే లేదు. ఒక వేళ మానజాచినా పాడించకుండా విడిచిన సెంటరూ లేదు. ఈ పాటతోబాటు 'ఏందిరో బోడి బోడి మామయ్యా – ఎందుకా వొడుగుదోటి తెచ్చావూ' అని గడతో చింతకాయలు కోసే ఓ సన్నివేశానికి చెందిన జానపద గేయాన్ని ప్రతి సభలోనూ ముందూ చివరా కూడా పాడించుకొని మరీ మరీ వినేవాళ్ళు ప్రజలు – మల్లయ్యన్నా. నేనైతే ధన వ్యామోహంలో పడి ఈ పాటలన్నీ పాడేవాడినే కాని నా అంతరాత్మ మాత్రం క్షోభించి పోయేది – ఎత్తైన గంగానది వంటి నా ఆకాశ సంగీతం నేలమీదకి దిగి బురదలగుండా డ్రైనేజీలకి ప్రవహిస్తుంటే ఈ రెండు చెవులూ అప్పగించి వింటూ ఉరుకున్నానే గాని మరేమి చేయలేకపోయాను.

నా గాంధర్వంతో బాటు నేనూ పతనమై అరిషడ్వర్గాలు నన్ను పిల్చి పిప్పి చేస్తుంటే చూస్తుండగానే శాపగ్రస్తుణ్ణై దేవతలాగ ఓ రాక్షసునిలాగా మారిపోయాను. పూలదండలూ, పొగడ్తలూ, నోట్లూ, నీరాజనాలూ నన్ను ప్రమత్తుణ్ణి చేయడంతో అర్థంలో పరమార్థం మరచిపోయి స్వార్థం కరాళ నృత్యం చేయగా నా గాన సరస్వతిని పడుపుగత్తెగా మార్చి అంగట్లో పెట్టి అందుకు అడ్డం వచ్చిన వారినందరిని అక్షరాలా హతమార్చివేశాను. అలా బలి అయిన వారిలో పుండరికాక్షుడు కూడా వున్నాడు.

పుండరికాక్షుడికి కళ అయితే ఉన్నది కాని తక్కిన టక్కులు లేవు. ఆ సమాజం కూడా అదేం చిత్రమో నిజాన్ని గుర్తించక గ్లామర్ వెంటబడి పిచ్చి కుక్కలా తిరుగుతుంది. పుండరికాక్షుడికి ఆశ్రయం చేతకాదు. ఆకర్షణ పెంచుకోవడం తెలియదు. ఎవరైనా వెళ్ళి ఎ.ఐ. ఆర్.లో ఫలానా ఆయన్ని కలుసుకోరా ప్రోగ్రామ్ ఇస్తాడు అంటే 'అంత నా ప్రోగ్రామ్ సమాజానికవసరమైతే వాళ్ళనే నా గుమ్మానికి రాని' అనేవాడు, కాని వింత ఏమంటే పుండరికాక్షుడి గుమ్మానికి ఏ ప్రముఖుడూ రాలేదు. పుండరికాక్షుడు సమాజంలోని ప్రముఖుడనేవినబడే ఏ వ్యక్తిని ఆశ్రయించి ఆ గుమ్మాలకెక్కుతూ, దిగుతూ కాలం గడపలేదు. పుండరికాక్షుడి సంగీతం నేను విన్నాను. అతడు నా సహాధ్యాయిగా ఉన్ననాటికన్నా బాగా ప్రగతిని సాధించాడు. ఇప్పుడు అతని గొంతులో సాక్షాత్తు పరమేశ్వరుడే నాదరూపంలో సాక్షాత్కరిస్తున్నాడు. ఇలా ఉండగా నాకు భారత గానశేఖర అని ఒక బిరుదు వచ్చింది. దానికి గాను ఓ పెద్ద సభ ఏర్పాటు చేసి అందులో నన్ను కొందరు సన్మానించారు. ఆ సభలో పుండరికాక్షుడు కూడా మాట్లాడాడు. అందరూ నేను అంతర్జాతీయ గాయకుణ్ణనీ, గానం మానవరూపమెత్తిందని, యాభైకోట్ల జాతీయ ప్రజల హృదయాధినాథుణ్ణని, దైవాంశ సంభూతుణ్ణని చాలా పొగిడారు. కాని పుండరికాక్షుడు మాత్రం పొగడలేదు. సరికదా విమర్శించాడు. 'ప్రగతి వుంటే ముందు ముందుకు పోవడం, కాని నారదుడు నా సహాధ్యాయిగా ఉన్న నాటినించి మీ గానశేఖర బిరుదం వచ్చేనాటికి ముందునించి వెనుకకు పోయాడు. ఇప్పుడు మీకాయన అందిస్తున్న మా గురు మహారాజ్ బోధించిన దైవీయ సంగీతం కాదు. మనుష్యుల్ని పశువులుగా మార్చే ఓ విధమైన మార్కెట్టు సరుకు. దాన్ని మీరు మెచ్చుకొని గంతులు వేస్తున్నారంటే అది మీ స్థాయిని తెలుపుతుంది. మీ బోడి మెప్పులకోసం నారదుడు జావలాగ జారిపోతున్నాడంటే అది ఆయన స్థాయిని తెలియజేస్తుంది' అన్నాడు సభాముఖంగా. దానితో హాహాకారాలు చెలరేగాయి. నాకు తల కొట్టేసినంత పనైంది. ఇదేమంటే తర్వాత ఎవరితోనో అన్నాడుట, 'నేను నారదుడి మేలుకోరేవాణ్ణి. కాబట్టే ముఖప్రీతులు నాకు నచ్చవు. పొగిడే మీరతణ్ణే పతితుణ్ణే చేశారు. మీరంతా పొగుడుతారు. గౌరవిస్తారు. కాని నేను మాత్రం ప్రేమిస్తాను. అతనికి అంతర్జాతీయ శేఖరా, అనో ఏదో బిరుదు ఇచ్చి మీరంతా కులుకుతున్నారు. సరే, కాని అమర సింహాసనం నుండి ఆటవిక స్థితిలోకి చేరిన అతణ్ణి మీలో ఎవరు రక్షిస్తారు? మీ లోపలి క్షుద్రకామమనే గజ్జికి అతని నాదాలూ, వినాదాలూ గోకుడుగా వాడుకుంటున్నారు. సరే కాని అతనేం కావాలి? ఈనాటి నారదుడి సంగీతం దివ్య మందిరంలోని విరిసిన పారిజాత ప్రసూనం కాదు. ఆబిడ్స్ సెంటరులో, మౌంట్ రోడ్‌లో, మెరైన్ డ్రైవ్‌లో, చాందినీచౌక్‌లో అమ్మబడే ఒక కాగితాల పూలకుండి. అనేకమైన ముడి ఇనుప పదార్థాలతోబాటు అక్కడ అమ్మబడే ఓ తుప్పుపట్టిన వాయు పదార్థం. అతన్నని మాత్రం లాభం ఏమిటి? సమాజమే ఆయన్ని చెడగొట్టింది. ఏం ప్రజలు వీళ్ళు? గంగ దొరకడం లేదని గాడిద పాలు తాగుతారా ఎవరైనా? ఈ విమర్శ నన్నే కాదు చాలా మందికి ఉద్రిక్త పరిచింది. ఉన్మత్తులని చేసింది. ఫలితంగా మా పశు కోపానికి పుండరికాక్షుణ్ణే బలి చేశాము. అక్షరాలా హత్య చేసి మా కీర్తి ప్రతిష్ఠల మీద ఎట్టి మాలిన్యమూ అంటకుండా జాగ్రత్త పడ్డాము...వింటున్నారా మల్లయ్యన్నా...' నా నరాలు చిన్న చిన్నన ముక్కలుగా రాలిపడుతున్నట్లనిపించింది. నా చుట్టూ ఉన్న గాలి స్తంభించి ఊపిరాడనట్లు అనిపించింది. నా గుండె స్తంభించి పోయిందా అన్నట్లు అచేతనుణ్ణయినాను. నారదుడు కథ చెప్పడం కొన్ని క్షణాలు ఆపాడు. ఆ నిశ్శబ్దం వాతావరణాన్ని ఇంకా భయంకరంగా మార్చింది. దానిని నేను భరించలేక పోయాను. పిచ్చివాడిలా అరిచాను. తరువాత నారదుడొకపొడి దగ్గు దగ్గి మళ్ళీ అన్నాడు...

'అంతే నా పాపం నన్నే కోరింది. నా గొంతులో మాధుర్యం ఎందుకో ఉన్నట్లుండి ఓ జవరంతో నశించి పోయింది. నిరంతరం మధుర వసంతాలు చిమ్మే నా గాత్రం శిశిరంలోని బోడి చెట్టులా మోడుబారి పోయింది. గొంతుని ఇన్సూరు చేసిన పైసలైతే వచ్చాయి కాని గొంతు మాత్రం రాలేదు. కొందరిది రామకృష్ణ పరమహంసకు వచ్చినట్లు మహాత్ములకు వచ్చే పుట్టకురుపు వ్యాధి అన్నారు. కొందరు కాదు కాదు — పుండరీకాక్షుడు పిశాచమై గొంతు నులుముతున్నాడన్నారు. ఇంకొందరు ఇంకేమో అన్నారు. ఏ నోళ్ళయితే నన్ను భూలోక గాన సరస్వతి, అంతర్జాతీయ గాన శేఖరుడు, అవతార పురుషుడు అన్నాయో ఆ నోళ్ళే పాపిష్టివాడన్నాయి. పీడ వదిలిందని శపించాయి. 'ఇలా అవుతుందని మా కెప్పుడో తెలుసు' అని త్రికాలజ్ఞులైన క్రాంతదర్శునివలె జోస్యాలు చెప్పారు. చీదరించుకున్నారు. మల్లయ్యన్నా — ఇంతకాలం నేను జీవించింది ఈ మిథ్యాప్రతిష్ఠ మధ్యా? అనిపించింది, చేతులు కాలిన తర్వాత. గురుమహరాజ్ ఆజ్ఞను తిరస్కరించినందుకు నాకు తగిన శాస్తి జరిగింది. అంతే కావాలి నాకు, దేవునికి ఉపయోగపడని ఈ గొంతును దేవుడే తీసుకున్నాడు. అయితే నాకిప్పుడు బాధ లేదు. భయం లేదు. ఓ ఆత్మ సంతృప్తి ఉంది. ప్రాయశ్చిత్యం పొందాననే పరమానందం లభించింది. ఇప్పుడు నా గొంతు వెనుకటి వలె కచ్చేరీలకూ, జనాకర్షణకూ ఉపయోగ పడదు. కాని ఉన్నట్టుండి ఎప్పుడో ఓ దివ్యావేశం వస్తుంది ఆ ఉద్రేకం గొంతుతో సంఘర్షణ పడి నాలుగైదు నాదాలు పలికిస్తుంది. వాటిని ఈ బీచుపల్లి హనుమాన్ల వారి పాద పద్మాలకే సమర్పించుకుంటాను. అదీ నా జీవిత గాథ. విన్నారా...' మరి మీ డబ్బేమయింది? హారతి కర్పూరంలా హరించి పోయిందా? వేదనా, ఆవేదనా దిగమింగి రోదనను గొంతులోనే నింపుకొని అనామకుడై అజ్ఞాతంగా ఈ గుళ్ళో దేవుని ఒళ్ళో ఎలా జీవిస్తున్నాడో...ఏదో ప్రశ్న అడగాలనిపించింది. అడగలేక పోయాను...

'ఏమిటి ఆలోచిస్తున్నారు మల్లయ్యన్నా?'

నా పేరు మల్లయ్య కాదని, ఇందుశేఖరుడని చెబుదామనిపించింది. నేను ఒక విశ్వ విఖ్యాతి గాంచిన గాయకుణ్ణని ఆయనకు తెలియజేయాలని కోరిక కలిగింది. కాని, నా కోరిక కంఠగతంగానే ఉండిపోయింది...మాటలు పెగల లేదు... ఏదో అవ్యక్తంగా నేను సణిగినట్లు మాత్రం నాకనిపించింది.

'మీ గొంతు వినాలని...'

సమాధానంగా నారదుడి నవ్వు...నవ్వు పొరలు పొరలుగా, తెరలు తెరలుగా వచ్చింది. మధ్యలో ఓ దగ్గు. ఆ తర్వాత మళ్ళీ నవ్వు. నవ్వు వెంటే మల్లెపూలవంటి, మొగలిరేకుల్లాంటి ఏవో సువాసనలు, సౌరభాలూ, నాద పరిమళాలూ...గాలి మొత్తం నాదంతో నిండినట్లనిపించింది. ఎవరో పుప్పొడి జల్లుతున్నట్లు. చంద్రునినుండి చల్లని, తెల్లని జలపాతాలు కురిపిస్తున్నట్లు, ఎక్కడో దూరంగా కోటిమంది గంధర్వులు వీణలు మీటుతున్నట్లు, సృష్టి మొత్తం క్షీరసాగరంలో స్థాపితమైనట్లు, సప్త స్వరాలు సప్తపదిగా మారి ఆకాశాన్నంటినట్లు పంచేంద్రియాలకూ, మనస్సుకూ అతీతమైన ఏదో అనుభూతి...ఏదో ఆరాటం...అదేమిటో సంచలనం, దీప్త మంద్రాలక్కడ గోచరించడం లేదు. అర్పణమూ, విసర్గమూ కనుబడటం లేదు. స్వరాలూ, శాస్త్రమూ ఈ సామాన్య లౌకిక పరిభాష నశించిన ఒక దివ్యానుభూతి. వేయి తెల్లని రెక్కల హంసలు ఎగురుతున్నట్లు, బీథోవెన్ మూన్‌లైట్ సొనాటా విరబూసినట్లు, జగత్తు మొత్తమూ నాదమయమై నేను దానికి కేంద్ర బిందువునైనట్లు అవాఙ్మానస గోచరమైన ఒక అనుభూతి — ఒక తాదాత్మ్యం...ఒకసంలీనం...

స్తంభించిన కాలం — కారణ రూపంలో జగత్తు.

'సార్ కారు బాగయింది' సుబ్రహ్మణ్యం కేక.

తెరిచేవున్న కళ్ళను మళ్లీ తెరిచి చూచాను. బావి దగ్గర చేతులు కడుక్కుంటున్న సుబ్రహ్మణ్యం. ఎదురుగా ఎవరూ లేరు... వేప చెట్టు రివ్వున ఓ విధమైన గాలిని విసురుతున్నది. లోపల దేవాలయంలో మినుకు

మనే సుందరుని పాదాల ముందు ఆముదపు ప్రమిద...

'సుబ్రహ్మణ్యం ఇక్కడ వున్నన నారదుడేడి...?'

'ఎవరు సార్...'

'అదే ఇప్పటిదాకా నా కెదురుగా కూర్చున్న బిచ్చగాడు...'

'ఎవరూ వున్నట్లు లేదు సార్... కాసేపటి క్రితం మీ గొంతు మాత్రం తియ్యగా, సన్నగా వినిపించింది నాకు. కారు బాగయింది. ఓ సారి స్టార్టు చేసి చూసి ఇటు వచ్చాను.' చూచాను. నడి నెత్తిన చంద్రుడు. అయోమయంగా లేచి నిలబడ్డాను. ఓ సారి గుడి చుట్టుపక్కల చూచాను. ఏమి కనబడలేదు. కేవలం పాలవెన్నెల్లో బాగా నానిపోతున్న పురాతన దేవాలయ గోపురం. రివ్వున వీస్తున్న వేపచెట్టు గాలి పలికించే ఓ ధ్వని. ఆకాశం ఎంతో ఎత్తున ఎగురుతున్న ఎవో ఆల పక్షులు చేస్తున్న అవ్యక్త నాదాలు...

'సుబ్రహ్మణ్యం...' పిచ్చివాడిలా ఏదో మాట్లాడబోయాను.

'సార్...'

రోడ్డు మీద బ్రిడ్జిగుండా కర్నూలు వైపుకు ఓ లారి పెద్ద ధ్వని చేస్తూ దూసుకు పోయింది. 'రండిసార్ – బాగా ఆలస్యమయింది. లేకుంటే ఈ పాటికి జడిచర్ల కూడా దాటిపోయేవాళ్ళం.'

నేను మాట్లాడకుండా కారులో కూర్చున్నాను. బండి హైదరాబాదు వైపుకు దూసుకు పోతున్నది.. చూస్తుండగానే కృష్ణానది బ్రిడ్జి వెనుక చీకట్లో కలిసిపోయాయి...

కారు ముందుకు మున్ముందుకు పోతున్నది. నేను శూన్యాకాశం వైపు చూస్తున్నాను. కాని ఆ చూస్తున్నది కర్నూలు నుండి బయలుదేరిన నేను కాదు – నేను కాని మరొక నేను. ఎంత పెద్ద స్వగతం. ఎంతటి అంతరంగ కథనం.

* * * * * * * * * *

ఓం

కురంజి

నమోస్తుతే సద్గురువందితాయ
నిరంతర నందితాయ
వ్యక్తా వ్యక్తాయ శాశ్వతాయ
ఆద్యంత రూప గుణ నామ వర్ణ రహితాయ
స్థితాయ హితాయ జగద్ధితాయ

నమోస్తు అభయంకరాయ శుభంకరాయ
వేణీధరాయ ప్రేమగంగాధరాయ
పూర్ణావతారాయ అర్ధనారీశ్వరాయ
మెహరాయ హరాయ మనోహరాయ

నమోస్తుతే పరమకారణ కారణాయ
సంసారకారణ వారణాయ
లోకత్రయార్తి హరణాయ
మందస్మిత భూషణాయ మౌనభాషణాయ

'అహం' 'మమేతి' దుర్వారభవవ్యాధి ఛేదకాయ
అబోధకాయ అవబోధకాయ
భక్త హృద్క్షేత్ర దివ్యకర్షకాయ
నమోస్తు హర్షకాయ ప్రేమవర్షకాయ

అవేద ఇవ అశక్త ఇవ జడవతు మౌనవేషణాయ
త్రివిధ భాషణాయ
ధూళిమివ శిష్యగణశోషణాయ
తోషణాయ మస్తు పోషణాయ
నమోస్తు భవనాటక ఖేలనాయ
మమపాలనాయ నమః

– మంత్రవాది శ్రీరామమూర్తి
*Edison, NJ*


# SUNIL V. KOPPAR

(Certified Public Accountant)
(New York & New Jersey)

* Accounting Services for New & Established Business
* Tax Services - Planning, Return Preparation for Businesses & Individuals, Representation in Tax Audits
* Financial Statement Preparation & Certification
* Computer Accounting System - Installation, Training & Support
* Top Notch Experience, Quality Service, Competitive Rates

**Please Call: (908) 679-0479**



# LAKSHMI VADAPALLI, M.D.

Board Certified in Internal Medicine

* SPECIALIZING IN DIABETES *

New Patients Welcomed

Accept Co-Med, Medicare, Pru-Care, Aetna Metlife

**(908) 821-0873**

**3084 Highway 27**
**Kendall Park, NJ 08824**

Call for Hours and Appointment
Weekend and Evening Hours Available